క్లుప్తంగా

పార్టీకి పూర్వ వైభవం తెస్తాం



మేయర్ సురేష్ బాబును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్: జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్ష, కార్యదర్శులుగా నియమితులైన దాసరి శివప్రసాద్, కె.మునిశేఖర్‌రెడ్డి అన్నారు. మేయర్ సురేష్ బాబును ఆదివారం వారు కలిసి సత్కరించారు. వారు మాట్లాడుతూ తనపై నమ్మకం నుంచి పదవి ఇచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున, షఫీ, ఆర్. చెన్నయ్య, రామ్మోహన్‌రెడ్డి, మున్నా, బాలకొండయ్య, పత్తిరాజేశ్వరి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్: వృత్తుల్లోకల్లా ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని కడప కోటిరెడ్డి మహిళా కళాశాల ప్రిన్సిపల్ సలీంబాషా, రిటైర్డ్ హెడ్మాస్టర్ సయ్యద్ ఇదయతుల్లా పేర్కొన్నారు. అంకిత భావంతో ఉపాధ్యాయ వృత్తిలో పనిచేసి 2024లో పదవీవిరమణ చేసిన 14 మంది ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులను ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ (ఐటా) నాయకులు ఆదివారం ఘనంగా సత్కరించారు. కడప బెల్లంమండీ వీధిలోని కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన కార్యక్రమంలో వారిని సన్మానించి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా పదవీ విరమణ చేసినప్పటికీ ఉపాధ్యాయ వృత్తికి వారు దూరం కారాదన్నారు. ఆరోగ్యం సహకరించినంత వరకూ వివిధ రకాల సేవలందిస్తుండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆజం, అబ్దుల్ రజాక్, షాకీర్ హుస్సేన్, నజీర్‌బాషా, అబ్బాస్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

డీఈఓను తొలగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.అంకన్న

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల ఆత్మాభిమానం దెబ్బతినేలా వేధిస్తున్న డీఈఓను తొలగించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. నగరంలోని పీడీఎస్‌యూ రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లాలో రోజూ ఏదో ఒక పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులపై ఇష్టానుసారం ప్రవర్తిస్తున్న డీఈఓను కలెక్టర్ జోక్యం చేసుకొని ప్రభుత్వానికి సరెండర్ చేయాలన్నారు. ఎస్ఎస్ఏలో పనిచేసే ఏఎస్ఓను వేధించడంతోనే ఆయన మృతి చెందాడని, ప్రైవేట్ స్కూల్ అనుమతుల్లో, ఓపెన్ ప్రైవేట్ స్టడీ సెంటర్ల వద్ద డబ్బులు తీసుకుంటోందని వచ్చిన ఆరోపణలపై వెంటనే విచారణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మనోజ్, మహేష్ పాల్గొన్నారు.

గౌడ హక్కుల సాధన కోసం ఐక్యంగా కదులుదాం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కడప రూరల్: గౌడ హక్కుల సాధన కోసం ఐకమత్యంగా కదలాలని రాష్ట్ర బలిజిట్టి కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు అన్నారు. పట్టణంలోని విశ్వేశ్వరయ్య భవన్‌లో జిల్లా ఈడిగ గౌడ సంక్షేమ సంఘం వార్షిక క్యాలెండర్ ఆవిష్కరణ సభ ఆదివారం జరిగింది. కార్యక్రమంలో సత్తిబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చదివించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రవిశంకర్ గౌడ్, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, గౌడ మహిళా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు సునీత గౌడ్, శ్రీరాములుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పక్షుల కోసం నీటి పాత్రల అమరిక



చెట్లపై ఏర్పాటు చేసిన పాత్రలో నీరు పోస్తున్న సిబ్బంది

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్ రెడ్డి ఆదేశాల మేరకు జాతీయ పక్షుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సిబ్బంది నగరంలో రహదారుల పక్కన చెట్లకు మట్టి నీటి పాత్రలను ఏర్పాటుచేశారు. ఆయా పాత్రల్లో నీరు పోసి వాటిలో నీటిని ఉంచే విధంగా చర్యలు తీసుకోనున్నారు.

కొండను కొల్లగొట్టి.. సొమ్మును కూడబెట్టి

జిల్లా కేంద్రమైన కడప నగరంలో మట్టి, గ్రావెల్ అక్రమ రవాణా విచ్చలవిడిగా సాగుతోంది. టీడీపీ నాయకుల ధన దాహం వల్ల నానాపల్లె సమీపంలోని కొండలు, గుట్టలు కరిగిపోతున్నాయి. చదును ప్రదేశాలు లోయలుగా మారుతున్నాయి. కిలోమీటర్ల మేర కొండలను పిండి చేసి లక్షలాది రూపాయలు దండుకుంటున్నారు. -కడప టాస్క్‌ఫోర్స్:

- విచ్చలవిడిగా మట్టి అక్రమ రవాణా
- కొండలు పిండి చేస్తున్న మట్టి మాఫియా
- చోద్యం చూస్తున్న మైనింగ్, రెవెన్యూ అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి



నానాపల్లె సమీపంలోని కాలభైరవ గడివద్ద కొండను తవ్వేసిన అక్రమార్కులు



గ్రావెల్ తవ్వకాల వల్ల ఏర్పడిన గుంత



మట్టి తవ్వి టిప్పర్లతో తరలిస్తూ....

ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకుండా సుమారు రెండు మాసాలుగా మట్టి, గ్రావెల్‌ను అక్రమ రవాణా చేస్తున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారేగానీ..అటువైపు కన్నెత్తి చూడలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నానాపల్లెలోని 919/1 సర్వే నంబర్ నందు యానాది కొట్టాల కాలభైరవ గడి వద్ద పాత కడపకు చెందిన టీడీపీ నేత కొండను త్రవ్వేసి చదును చేస్తున్నారు. ఆ మట్టిని ప్రైవేటు వ్యక్తులకు అమ్ముతూ మట్టి తీసిన స్థలాన్ని చదును చేసి ఆక్రమించేందుకు రంగం సిద్ధ చేశారు. గ్రావెల్ తోలడం ద్వారా ఆదాయం ఆర్జించడమేగాక... భూమిని చదును చేసి రెండు వైపులా ఆదాయం పొందేందుకు మాస్టర్ ప్లాన్ వేసినట్లు తెలుస్తోంది. పేదలెవరైనా సెంటు డీకేటీ స్థలం ఆక్రమిస్తే నానా రాద్ధాంతం చేసే రెవెన్యూ అధికారులు.. ఎకరాలకు ఎకరాలు డీకేటీ భూమిని తయారు చేసుకుంటున్నా స్పందించడం లేదనే ఆరోపణలున్నాయి.

రెండు జేసీబీలతో...రాత్రివేళల్లో....

జగనన్న కాలనీ ఎస్‌టీపీ రెండో లే అవుట్‌పైన నానాపల్లె, వైఎస్సార్ కాలనీ సమీపాన ఎన్‌జీవో కాలనీకి చెందిన ఇరువురు టీడీపీ బ్రదర్స్ రెండు జేసీబీలతో తవ్వి గ్రావెల్ అక్రమ రవాణా సాగిస్తున్నారు. పగలు ఒకట్రెండు టిప్పర్లతో రాయల్టీ చెల్లించి, రాత్రి వేళ పదుల సంఖ్యలో టిప్పర్లతో టన్నుల కొద్దీ మట్టిని మాయం చేస్తున్నారు. కాలువ ప్రక్కనున్న పొరంబోకు స్థలాలు, వివాదాస్పద డీకేటీ స్థలాల్లో మకాం వేసి ఆ మట్టిని ఆయా ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. లీజు క్వారీల నుంచి మట్టి తోలితే టిప్పరుకు రూ.1750 ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. వీరు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా...ప్రభుత్వానికి రూపాయి చెల్లించకుండా కేవలం రూ.4000, రూ.4500 లకు టిప్పర్ మట్టి తోలడటంతో లీజు క్వారీలకు అనుమతి ఉన్నవారు తక్కువ ధరకు మట్టిని తోలలేక క్వారీలను ఆపేసినట్లు తెలుస్తోంది. సాహసించి ఎవరైనా లీజు క్వారీ నడిపినా టీడీపీ నాయకులు వారి సామ, దాన, భేద, దండోపాయాల కు బెదిరి క్వారీని మూసివేయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. వైఎస్సార్ కాలనీకి పోయే మార్గంలోనే మైనింగ్ శాఖ చెక్ పోస్టు ఉన్నప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతోంది. సామాన్యులు, చిన్నా, చితకా వారి నుంచి ముక్కు పిండి రాయల్టీ వసూలు చేసే సిబ్బంది అధికార పార్టీ నేతలకు తలొగ్గుతున్నట్లు ఆరోపణలున్నాయి. అధికారులు స్పందించి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

కడప ఎడ్యుకేషన్: ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఉపాధ్యాయులకు వెంటనే వేతనాలు విడుదల చేయాలని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు ఒకటో తారీఖునే జీతం అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కడప ఎస్‌టీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించే విధంగా ఉత్తర్వులివ్వాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రతి నెలా తమ వేతనం నుంచి వైద్య ఖర్చులు, పిల్లల వివాహం, చదువుల నిమిత్తం తీసుకున్న పీఎఫ్, ఏపీ జీఎల్ఐ పొదుపు పథకాలకు నెలసరి చందా కడుతున్నారన్నారు. ప్రభుత్వం దీర్ఘకాలికంగా పీఎఫ్, ఏపీ జీఎల్ఐ పరిణీతి చెందిన రుణాల మొత్తం బకాయిలు మంజూరు చేయడం లేదన్నారు. పొదుపు చేసిన సొమ్ము రాకపోవడం వలన తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఏపీ జీఎల్ఐ, పీఎఫ్ బకాయిలు చెల్లించే విధంగా ఉత్తర్వులివ్వాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆవుల శ్రీనివాసులు, చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిషన్ ఏర్పాటుచేయాలన్నారు. ఐఆర్ 35 శాతం ప్రకటించి సంక్రాంతి కానుకగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీపి కబురు అందించాలని కోరారు. ఈ సమావేశంలో గౌరవ సలహాదారుడు క్రిష్టఫర్ జాన్, శ్రీరాములు సలాం, ఎల్వీ.రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

7న కార్మికుల నిరసన



మాట్లాడుతున్న పి.సుభాషిణి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచాలని కోరుతూ ఈ నెల 7న ‘జాతీయ నిరసన దినం’ చేపట్టి, పీహెచ్‌సీ వైద్యాధికారికి వినతిపత్రం ఇవ్వాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.సుభాషిణి కోరారు. నగరంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో స్కీం కార్మికులు అత్యంత కీలకంగా పనిచేస్తున్నారన్నారు. తమ సమస్యల పరిష్కారానికి ఆశా కార్మికులు ఆందోళన చేస్తున్నా పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, మెడికల్ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని ఆమె కోరారు. వేతనంతో కూడిన మెటర్నిటీ సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు, పదవీ విరమణ అనంతరం పెన్షన్ రూ.10వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నాయకులు గుంటి వేణుగోపాల్, పి.చంద్రశేఖర్, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యు.మరియమ్మ, కె.కల్పన, బి.శాంతమ్మ, రమణమ్మ, సి.అమ్ములు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారులు

కడప కల్చరల్ : కడప నగర శివారులోని శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా మ్యాజిక్ షో, నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. కడపకు చెందిన విజయశాంతి డ్యాన్స్ స్కూల్ ప్రదర్శనలు అలరించాయి. సీరియల్ నటి యుక్తాశ్రీ, ప్రొద్దుటూరుకు చెందిన మెజిషియన్ హరేరామ్ తమ మాటలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో శివప్రసాదొరెడ్డి, మధుబాబు పాల్గొన్నారు.

మేనిఫెస్టోలో వాగ్దానాలను అమలుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మేకల శివార్జున

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకలశివార్జున డిమాండ్ చేశారు. కడప ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో ఆదివారం ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వెంటనే ఐఆర్ ప్రకటిస్తామని, ఆ తరువాత మెరుగైన పీఆర్‌సీ ప్రకటిస్తామని కూటమి మేనిఫెస్టోలో చెప్పారన్నారు. హామీ ఇచ్చి ఆరు నెలలు దాటినా వాగ్దానాలను నెరవేర్చలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు 2022 సంవత్సరం నుంచి ఇప్పటికీ సరెండర్ బిల్లులు మంజూరు కాలేదని, దీర్ఘకాలంగా ఇలాగే ఉంచడం భావ్యం కాదన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఆంగ్లంతోపాటు, తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలన్నారు. ఉద్యోగుల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శేషగిరిరావు, జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌బాబు, జిల్లా కార్యదర్శి కట్టా గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

10న తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన



ఇంటి స్థలాలకు వినతి పత్రాలు అందజేస్తున్న సీపీఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: అర్హులైన పేదలకు రెండు సెంట్ల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10వతేదీన కడప తహసీల్దారు కార్యాలయం ఆందోళన కార్యక్రమం చేపట్టినట్లు సీపీఐ కడప నగర కార్యవర్గ సభ్యురాలు వడ్ల భాగ్యలక్ష్మి, సీపీఐ నాయకులు మల్లికార్జున పేర్కొన్నారు.వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల స్థలాల కోసం జనవరి 2వ తేదీనుంచి 10వ తేదీ వరకు 11వ డివిజన్, 15వ డివిజన్ పరిధిలోని అర్హులైన లబ్ధిదారులతో కలిసి వ్యక్తిగత ఆర్జీలు రాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చి ఏడు నెలలు పూర్తికావస్తున్నప్పటికీ ఇళ్ల స్థలాల గురించి మాట్లాడటం లేదన్నారు. అర్హత కలిగిన పేదలకు స్థలాలతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 10న వ్యక్తిగత అర్జీలతో కడప మండల తహసీల్దారు కార్యాలయానికి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో నరసమ్మ, శారద, ప్రీతి, ఖాదర్‌బాషా, మాణిక్యమ్మ పాల్గొన్నారు.

హెల్త్ సెక్రటరీలకు అదనపు బాధ్యతలు వద్దు



మాట్లాడుతున్న బీవీ.కొండలరావు

కడప వైఎస్ఆర్ సర్కిల్: సచివాలయ హెల్త్ సెక్రటరీలకు అదనపు బాధ్యతలు అప్పగించవద్దని సచివాలయ హెల్త్ సెక్రెటరీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.లీలావతి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బీవీ.కొండలరావు పేర్కొన్నారు. నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగిన ప్రాంతీయ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏఎన్ఎంలకు అదనపు విధులు అప్పగించవద్దని సూచిస్తూ జీఓ జారీ చేసినప్పటికీ, సరైన గౌరవం ఇవ్వలేదన్నారు. ఏఎన్ఎంలకు ప్రత్యక్ష అధికారిణి లేకపోవడమే కారణమన్నారు. పంచాయతీ రాజ్, వైద్య ఆరోగ్య శాఖలకు ఇద్దరు అధికారులు నివేదిక సమర్పించడం గందరగోళం రేకెత్తిస్తోందన్నారు. జియో యాప్స్, హౌస్ హోల్డ్ సర్వే, డేటా ఎంట్రీ, పెన్షన్ చెల్లింపులు అప్పగించడంతో ఆరోగ్య సేవా బాధ్యతలపై దృష్టి పెట్టడం కష్టంగా ఉందన్నారు. పని సమయం వృథా చేయిండమేగాక, బెదిరింపులు, మెమోలు, షోకాజ్ నోటీసుల ద్వారా వేధించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, జిల్లా డిప్యూటీ సెక్రటరీ కేసీ.బాదుల్లా, నగర ప్రధాన కార్యదర్శి ఉద్దె.మద్దిలేటి, పర్మిల, ఎల్లమ్మ, రజిని, ప్రవీణ, జయ, విజయభారతి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తాం



సమావేశంలో పాల్గొన్న అఫ్జల్ ఖాన్, తదితరులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: మత విద్వేషపు అజెండా అమలు చేస్తూ కొనసాగుతున్న హోంమంత్రి అమిత్ షా, బీజేపీ నాయకుల పరిపాలనపై ఉద్యమిస్తామని ఏపీ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్ పేర్కొన్నారు. నగరం లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ పీసీసీఅధ్యక్షురాలు షర్మిల నాయకత్వంలో ‘జై బాపు- జై భీమ్- జై సంవిధాన్’ పేరిట వివిధ రూపాల్లో ఆందోళనలు, నిరసనలు చేపట్టనున్నట్లు వివరించారు. బీజేపీ మత విద్వేష ఘోరాలను ప్రజలకు తెలియజేస్తూ వారిని చైతన్యవంతులను చేస్తామన్నారు. పార్లమెంట్‌లో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు వివిధ దశల్లో నిరసనలు చేపడతామన్నారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు, నాయకులు పాదయాత్ర నిర్వహించి ప్రజలను జాగృతం చేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో ఆసిఫ్‌ఖాన్, జహూర్, హమీద్ పాల్గొన్నారు

మహిళలపై దాడులను అరికట్టడంలో విఫలం



మాట్లాడుతున్న పీవీ.సుందరరామరాజు

కడప ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలపై దాడులు అధికమయ్యాయని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీ.సుందరరామరాజు ఆరోపించారు. కడప ఓంశాంతి నగర్‌లో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాయలసీమ జోన్ కార్యాలయాన్ని ఆ పార్టీ నాయకులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుందరామరాజు మాట్లాడుతూ హోం మంత్రిగా మహిళ ఉన్నా.. దాడులను అరికట్టడంలో విఫలమయ్యారన్నారు. కోటపాటి సుబ్బమ్మ, హిమబిందు, అరుణ కుమారి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాక మహిళలకు భద్రత లేకుండా పోయిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక కాలయాపన చేయడం సరి కాదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు ప్రదీప్‌రెడ్డి, జయవర్ధన్, నారాయణరెడ్డి, సీఆర్వీ.ప్రసాద్, సుబ్బరాయుడు, సగిలి గుర్రప్ప, దేవర కృష్ణ, అంజి, దాదాపీర్, రాజేంద్ర ప్రసాద్, హరిత, లక్ష్మీదేవి, జయమ్మ, పెద్ద అమ్ములు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి సేవలు అమూల్యం



అస్గర్‌అలీని సన్మానిస్తున్న ఇలియాస్ బాషా

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు అస్గర్ అలీ సేవలు అమూల్యమని తమసర్వీసులో ఎంతోమంది విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దారని రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ఎండీ ఇలియాస్‌బాషా అన్నారు. ప్రొద్దుటూరు అమృత్ నగర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడు అస్గర్ అలీని ఆదివారం తోటి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కడపలోని సుల్తాన్ ఫంక్షన్ హాల్లో హెచ్ఎం శ్రీహరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇలియాస్‌బాషా మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థుల ఉన్నత చదువులకు అలీ కృషి చేశారన్నారు. అనంతరం అస్గర్ అలీని ఉపాధ్యాయులు మహమ్మద్ అయూబ్, శ్రీహరి, సయ్యద్ సిరాజుద్దీన్, మస్తాన్‌వలి, జుబేర్ అహ్మద్, తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్లా, ఎఫ్ఎంఎస్ ఖాదర్ శిష్యులు , బంధుమిత్రులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్ష

కడప వైఎస్ఆర్ సర్కిల్: భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని క్లెయిమ్‌లు వెంటనే విడుదల చేయాలని కోరుతూ సోమవారం కడప కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్ష చేపడుతున్నట్లు ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ ఉద్దె.మద్దిలేటి. జిల్లా ప్రధాన కార్యదర్శి లింగన్న పేర్కొన్నారు. నగరంలోని హోచిమన్ భవన్‌లో విలేకరులతో ఆదివారం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇసుక పాలసీ పేరిట కొరత సృష్టించిందని, భవన నిర్మాణ కార్మికులు పనులు లేక అప్పుల పాలవుతున్నారని తెలిపారు. సంక్షేమ బోర్డులో విడతల వారీగా రూ.16 వందల కోట్లు తీసుకుని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారన్నారు. బోర్డు సభ్యులకు క్లెయిమ్ చెల్లించకుండా కార్మికులను తిప్పలు పెడుతున్నారని, ఇంతవరకూ ఏ ఒక్కరికీ నయాపైసా చెల్లించలేదన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పునఃప్రారంభించాలని వారు విజ్ఞప్తిచేశారు. ఈ సమావేశంలో ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు నాగేశ్వరరావు, భవన నిర్మాణ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

నీ జీవిత గమనం డైరీ

మనసును కదిలించిన సంఘటనలు.. హాయి గొలిపే జ్ఞాపకాలు... ఉత్సాహాలు, ఉద్వేగాలు.. వినోదాలు.. విషాదాలు.. ఇలా ఏ రోజుకారోజు అన్నింటినీ క్లుప్తంగా, పదిలంగా దాచుకునే చోటు డైరీ. రాసిన తర్వాత ఆ తర్వాత ఎప్పుడో తీరిక వేళల్లో ఒక్కో పేజీ తిరిగేస్తుంటే ఆ జ్ఞాపక పుటల్లో సంతోషాలు, భావోద్వేగాలు.. ఇలా ఎన్నెన్నో తియ్యని గాయాలు, మూడ్ వచ్చినపుడు రాసుకునే చిన్న గేయాలు.. అన్నీ మనసుకు ప్రతిబింబాలు. ఈ డైరీల వినియోగంపై ప్రత్యేక కథనం.

- జ్ఞాపకాలు పదిలంగా రాసుకున్న జనం
- నగరంలోని మార్కెట్లలో డైరీలకు కళ



గడియారంతో కూడిన డైరీ

కడప కల్చరల్: రోజువారీ జీవితంలో జరిగే సంఘటనలను వరుసగా క్రమపద్ధతిలో రాసుకునేందుకు డైరీ ఎంతగానో పనికి వస్తుంది. జరిగిన విషయాలేగాక, వాటిపై మన ప్రతి స్పందనను డైరీలో పొందుపరచి వర్తమానం గతమై, భవిష్యత్తుకు మార్గనిర్దేశనం చేయవచ్చు. ఎవరితోనూ చెప్పుకోలేని విషయాలను రాసుకునే మిత్రుడిగా డైరీ ఉపయోగపడుతుంది. ఓ మోస్తరు డబ్బున్న వాళ్ల నుంచి అత్యంత ధనికులైన వారికి మాత్రమే పరిమితమై ఉండిన డైరీ.. ఆ తర్వాత మధ్య తరగతి వరకూ వచ్చింది. ఆధునిక జీవితంలో డైరీలకు ఎంతో ప్రాధాన్యం ఉండేది. కంప్యూటర్లు, స్మార్ట్ ఫోన్ల రాకతో కొంత జోరు తగ్గినా నేటికీ వీటిని వాడేవారు చాలామంది ఉన్నారు. బరువు దించుకుంటేగానీ మనసు తేలిక పడదు. అప్పుడప్పుడూ గతంలో రాసుకున్న పేజీలు తిరిగేస్తే డైరీల్లో అప్పటి మూడ్‌కు పూర్తిగా భిన్నంగా ఉండి ఆశ్చర్యం వేస్తోంది. కావాల్సినపుడు తిరిగేసుకుని ఆ జ్ఞాపకాలను నెమరేసుకునేందుకు డైరీలను వీలైనంత ఎక్కువకాలం ఓ మధురమైన నిధిలా దాచుకుని ఆనందిస్తుంటారు.

ఎన్నో రకాలు

జ్ఞాపకాల దొంతరగా భావించే డైరీలను పలు రకాలుగా వాడేవారున్నారు. తమ అనుభూతులను భావుకంగా కవితల్లా రాసుకునే వారు ...అడ్రస్‌లు, ఫోన్ నెంబర్లు రాసుకునే వారు, చివరికి లాండ్రి పద్దు రాసుకునే వారు కూడా లేకపోలేదు. మొత్తంపై డైరీ రాయడం హుందాతనానికి గుర్తుగా భావిస్తారు. కొన్నాళ్ల, కొన్నేళ్ల తర్వాత మనం రాసిన విషయాలు మనకే గమ్మత్తుగా అనిపిస్తాయి. అందుకే పలువురికి నేటికీ డైరీ రాసుకునే అలవాటు ఉంది. ఎందరో మహానుభావులు అలా రాసిన డైరీలు తర్వాత కొన్నేళ్లకే మంచి గ్రంథాలుగా రూపుదిద్దుకున్నాయి. చారిత్రక గ్రంథాలుగా మారి చరిత్ర సృష్టించాయి. డైరీలలో వ్యక్తిగతమైన అంశాలను ఎక్కువగా రాసుకుంటారుగనుక ఒకరు రాసిన డైరీని ఇతరులు చదవడం సంస్కారం కాదు.

డైరీలతో కళకళ

కడప జిల్లా కేంద్రంలో డైరీ రాసే వారి కోసం సంవత్సరం ప్రారంభంలో మార్కెట్లలో రకరకాల, రంగు రంగుల డైరీలు కళకళ లాడుతున్నాయి. పలు దుకాణాల్లో ఖరీదైన లెదర్, రెగ్జిన్ లెదర్ బైండింగ్ గలవి, పర్సు, పెన్‌స్టాండ్, గడియారం, క్యాలికులేటర్ల సౌకర్యం గలవి కూడా లభిస్తున్నాయి. పెద్ద నగరాలలో 8 జీబీ పెన్‌డ్రైవ్, గడియారం, క్యాలిక్యులేటర్, పెన్, కంపాస్ సెట్ తదితరాల కాంబినేషన్‌లోనూ లభిస్తున్నాయి. పెట్టెలలాగా తాళం వేసుకునే అవకాశం గల డైరీలు అందుబాటులో ఉన్నాయి. దేశ దేశాల మ్యాపులు, సమయాలు, రాజధానులు, పిన్‌కోడ్, ఫోన్ కోడ్ నెంబర్లు, పోస్టల్, రైల్వే సమాచార, ప్రకృతి, ఆధ్యాత్మికం, సామాజిక సేవా, ఇంజినీరింగ్, ఎగ్జిక్యూటివ్ అంశాలను దాదాపు ప్రతి పేజీలో పొందుపరిచిన డైరీలు లభిస్తున్నాయి. ఇవిగాక ఉపాధ్యాయులు, ఇంజినీర్లు, వైద్యులు తదితర ఉద్యోగాల్లో ఉన్న వారికి అవసరమైన సమాచారంతో కూడిన డైరీలు కూడా లభిస్తుండడం విశేషం. పలు రకాల డైరీలు రూ.40 నుంచి రూ.1500 ధరలో మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. చొక్కా జేబులో ఇమిడే ప్యాకెట్ డైరీ రూ.15కు లభిస్తోంది. ఇటీవలి కాలంలో స్వచ్ఛంద, వ్యాపార సంస్థలు, దుకాణాలు, కంపెనీలు డైరీలను రూపొందించి తమ ఖాతాదారులకు నూతన సంవత్సర కానుకగా అందజేస్తున్నాయి. ఉద్యోగుల్లో తమ సంఘాల ద్వారా కూడా తమకు సంబంధించిన వివరాలు, జీఓలతో ప్రత్యేకంగా డైరీలను రూపొందిస్తున్నారు. మరి ఇలాంటి మంచి హాబీని మనం కొనసాగిస్తూ పిల్లలకు కూడా అలవాటు చేద్దాం!